'ఆపి' అధ్యక్షుడు డా.సతీష్ కత్తులను సత్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

క్యాన్సర్ నివారణకు సహకారం అందిస్తాం

బంజారాహిల్స్, అక్టోబర్ 30: తెలంగాణ రాష్ట్రంలో క్యాన్సర్ నివారణ కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్(ఆపి) అధ్యక్షుడు, ప్రముఖ క్యాన్సర్ వైద్యుడు డా.సతీష్ కత్తుల వెల్లడించారు. జూబ్లీహిల్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం కలిసిన ఆయన.. క్యాన్సర్ వ్యాప్తికి కారణాలు, జీవనశైలిలో మార్పులు, ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. రాష్ట్రంలోని కొన్ని మెడికల్ కళాశాలల్లో క్యాన్సర్, గుండె సమస్యలపై 'ఆపి' ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వం చేపట్టిన క్యాన్సర్ నివారణ ప్రాజెక్టులకు సహకారం అందిస్తామని తెలిపారు.

రేపు సదర్ వేడుకలు

ఖైరతాబాద్, అక్టోబర్ 30 : నవ యుగ యాదవ సంఘం, చౌదరి యాదయ్య యాదవ్ అండ్ బ్రదర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం సదర్ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం ప్రతినిధులు రాజు యాదవ్, మహేశ్ యాదవ్ తెలిపారు. బుధవారం ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, తదితరులకు ఆహ్వానపత్రికలను అందజేశారు. బడా గణేశ్ ప్రాంగణంలో సాయంత్రం 7గంటల నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయని వారు తెలిపారు.

టీజీఎస్పీడీసీఎల్‌లో సత్వర సేవలకు డయల్ 1912

సెంట్రల్ బ్రేక్ డౌన్ విభాగాలకు అత్యవసర వాహనాలు

జూబ్లీహిల్స్,అక్టోబర్30: టీజీఎస్పీడీసీఎల్ లో వేగవంతమైన సేవలకు డయల్ 1912 వాహనాలను ప్రవేశపెట్టారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు చెక్ పెట్టేందుకు సెంట్రల్ బ్రేక్ డౌన్ విభాగాలకు అత్యవసర వాహనాలను కేటాయించారు. గతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతే వినియోగదారులు ఫ్యూజ్ ఆఫ్ కాల్‌కు ఫిర్యాదు చేయాల్సివచ్చేది. ఆయా సెక్షన్‌ల పరిధిలో ఫిర్యాదు అందుకున్న సిబ్బం ది ఆటోలు, మారుతి వ్యాన్‌లలో ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్దకు.. లేదా సంఘటనా స్థలానికి చేరుకునేవారు. అయితే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇప్పుడు డయల్ 100 తరహాలో 1912 టోల్ ఫ్రీ సేవలను ప్రవేశపెట్టారు. విద్యుత్ వినియోగదారులు 1912 కు డయల్ చేసిన వెంటనే సంబంధిత ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఆఫీస్‌కు ఫోన్ కాల్ కనెక్ట్ అవుతుంది. ఈ వాహ నంలో అత్యవసర మరమ్మతుల పరికరాలతో సిద్ధం గా ఉండే సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సరఫరాను పునరుద్ధరించేందు కు చర్యలు తీసుకుంటారు. బుధవారం యూ సుఫ్‌గూడ కూడలిలో టీజీఎస్పీడీసీఎల్ బంజారాహిల్స్ డివిజన్ సీబీడీ ఏడీఈ గోపి ఆధ్వర్యంలో 1912 వాహనంతో ఏఈ ప్రవీణ్, సిబ్బందితో కలిసి పనులు చేపట్టారు. వినియోగదారులు ఇకపై ఫ్యూజ్ ఆఫ్ కాల్‌కు ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేదని.. విద్యుత్ అంతరాయాల సమస్యలపై నేరుగా 1912 కు డయల్ చేయాలని బంజారాహిల్స్ డీఈ హనుమంతరావు తెలిపారు. బంజారాహిల్స్ డివిజన్ పరిధిలో యూసుఫ్‌గూడ, శ్రీకృష్ణానగర్, ఎల్లారెడ్డిగూడ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, మాదాపూర్ సెక్షన్లు ఉన్నాయని తెలిపారు. ఆయా సెక్షన్‌ల పరిధిలో 22 సబ్ స్టేషన్లు.. 188 ఫీడర్లు.. 26 వేల ట్రాన్స్‌ఫార్మర్లు.. 2 లక్షల 10 వేల మంది వినియోగదారులున్నారని తెలిపారు. ఆయా సెక్షన్‌ల పరిధిలో వినియోగదారులు విద్యుత్ సరఫరాలో ఏ సమస్య వచ్చినా డయల్ 1912 కు కాల్ చేయాలని తెలిపారు.



యూసుఫ్‌గూడ కూడలిలో 1912వాహనంతో పనులు చేపడుతున్న ఏఈ ప్రవీణ్, సిబ్బంది

ఇంటింటి సమగ్ర సర్వేను విజయవంతం చేయాలి

మణికొండ, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కమిషనర్లు

మణికొండ, అక్టోబర్ 30 : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వేను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని పంచవటికాలనీ కమ్యూనిటీహాల్‌లో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలపై ఎన్యుమరేటర్లుగా నియమింపబడిన సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అన్నివర్గాల సహకారాన్ని తీసుకుని సమగ్ర కుటుంబ సర్వేనువిజయవంతం చేసేందుకు కృషిచేయాలని సూచించారు. మేనేజర్ శ్రీధర్, డీఈ శివసాయి, ఏఈ సంజయ్, టీపీవో సంతోష్‌సింగ్, టీఎంఎస్ లక్ష్మి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

● బండ్లగూడ,అక్టోబర్ 30: ఇంటిం టి సర్వేను సక్రమంగా నిర్వర్తించాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర ఎన్యూమరేటర్లను ఆదేశించారు. బుధవారం ఆయన.. కార్పొరేషన్ పరిధిలోని లార్డ్స్‌కళాశాలలో, ఎస్ఎంపీ పాఠశాలలో ఎన్యుమరేటర్లకు సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేయర్ లతాప్రేమ్‌గౌడ్, టీపీఎస్ అధికారి వా ణి, ఏఈ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

● జూబ్లీహిల్స్ : యూసుఫ్‌గూడ సర్కిల్‌లో నవంబర్ 5 నుంచి 20 వరకు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలని జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా ఆదేశించారు. బుధవారం యూసుఫ్‌గూడ పోలీస్ బెటాలియన్‌లోని మంజీరా కమ్యూనిటీ హాల్‌లో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేత

రాజేంద్రనగర్ మండల కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అర్హులైన వారికి షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం 665 చెక్కులు ఉండగా అందులో 488 షాదీ ముబారక్ , 177 కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమలో తాసీల్దార్ రాములు, రెవెన్యూ సిబ్బంది, నాయకులు ముజమిల్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు. *– బండ్లగూడ,అక్టోబర్ 30*

పంచాయతీ కార్మికులకు దుస్తుల పంపిణీ

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 30 : పంచాయతీ కార్మికులకు దిపావళి సందర్భంగా స్థానిక నాయకుడు మహేశ్ బట్టలు, సబ్బులు ఇతర సామగ్రిని పంపిణీ చేశారు. బుధవారం శంషాబాద్ మండలంలోని రామంజాపూర్ గ్రామంలోని పంచాయతీ కార్మికులకు సామగ్రిని పంపిణీ చేశామని మహేశ్ వివరించారు. ప్రతి రోజు ఉదయం నిద్రలేచిన నుంచి రాత్రి నిద్ర పోయేవరకు గ్రామానికి సేవలందిస్తున్న కార్మికుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, ఈశ్వరయ్యచారి, రాజేందర్‌రెడ్డి, భిక్షపతి, రవి, కృష్ణచారి, శ్రీకాంత్, మల్లేశ్, శ్రీశైలం, ధర్మేందర్, సాయికుమార్ పాల్గొన్నారు.

భూదాన్ భూములు పేదలకు పంచాలి

హిమాయత్‌నగర్,అక్టోబర్ 30: రాష్ట్రంలోని భూదాన్ భూములను పేదలకు పంచాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈటీ నరసింహ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లక్షన్నర ఎకరాలకు పైగా భూదాన్ భూములు ఉన్నట్లు ప్రభుత్వ రికార్డులో నమోదై ఉందని, వందల ఎకరాల భూములు అన్యాక్రాంత మైనవని ఆరోపించారు. పేదలకు చెందాల్సిన భూదాన్ భూములను రియల్ ఎస్టేట్ సంస్థలకు ప్రభుత్వం కట్టబెడుతుందని మండిపడ్డారు. భూదాన్ భూములను బదలాయించిన అవినీతి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. భూదాన్ భూములను కబ్జాదారుల నుంచి విడిపించి వాటి వివరాలను బహిర్గతం చేయాలన్నారు. వ్యవసాయంకు యోగ్యమైన భూములను పేదలకు మూడు ఎకరాల చొప్పున పంపిణీ చేసి, అర్హులైన వారికి ఇండ్ల స్థలాలు ఇచ్చి ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూదాన్ భూములను పేదలకు పంచే వరకు పోరాటాలు చేస్తామని వారు అన్నారు.

టూరిజంలో జరిగే అక్రమాలపై విచారణ చేయాలి

హిమాయత్‌నగర్, అక్టోబర్ 30: రాష్ట్రంలోని టూరిజం సంస్థలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సమగ్రమైన విచారణ జరిపించాలని తెలంగాణ టూరిజం కార్పొరేషన్ కాం ట్రాక్ట్,ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.ఎస్.బోస్ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టూరిజం,హరిత హోటల్స్ పేరుతో అనేక ప్రాంతాల్లో బోటింగ్ విధానం, సౌండ్, లైట్స్, ట్రాన్స్‌పోర్ట్ లాంటి విధాలుగా ప్రజలకు సేవలు అందిస్తూ ప్రభుత్వానికి ఆదాయంను సమకూర్చడంలో ముఖ్య ప్రాత పోషిస్తున్నాయని తెలిపారు. టూరిజం సంస్థలో పనిచేసే కొంతమంది అక్రమార్కులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ టూరిజం సంస్థకు వచ్చే ఆదాయానికి గండికొట్టడంతో పాటు సంస్థకు చెడ్డ పేరు తీసుకువస్తున్నారని ఆరోపించారు. నగరంలోని సాలార్ జంగ్ మ్యూజియంలో టూరిజం నడిపించే హోటల్‌లో ఎక్కువ రేట్లకు పదార్థాలను విక్రయిస్తున్నట్లు అధికారులు చేపట్టిన తనిఖీలో బయటపడిందన్నారు. ఇలాంటివి జరగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంస్థలకు లాభాలు పెరగాలంటే అవినీతి, అక్రమాలకు పాల్పడే వారిని గుర్తించి భరతం పట్టాలని కోరారు.

దేవాలయాల పరిరక్షణకు ప్రభుత్వాలు పాటుపడాలి

ఖైరతాబాబాద్, అక్టోబర్ 30 : పాలక ప్రభుత్వాలు దేవాలయాల చట్టాన్ని పకడ్బందీగా అమలుచేయడంతోపాటు వాటి పరిరక్షణకు పాటుపడాలని చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు రంగరాజన్ అన్నారు. బుధవారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాగృతి వారపత్రిక వెలువరించిన దీపావళి ప్రత్యేక సంచిక (దేశమే దేవాలయం)ను సీనియర్ జర్నలిస్టు వళ్లీశ్వర్, జాగృతి సంపాదకుడు డాక్టర్ గోపరాజు నారాయణ రావు, ఆచార్య కసిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వక్ఫ్‌బోర్డు హక్కులను కాపాడేందుకు శ్రద్ధ చూపిస్తున్న ప్రభుత్వాలు దేవాలయాల పరిరక్షణకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. దేవాలయాలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు.

శ్మశానవాటికలో క్లీనింగ్ పనుల పరిశీలన

బంజారాహిల్స్, అక్టోబర్ 30 : దీపావళి సందర్భంగా వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీ, పంజాగుట్ట హిందూ శ్మశానవాటికల్లో చేపట్టిన క్లీనింగ్ పనులను బుధవారం స్థానిక కార్పొరేటర్ మన్నె కవితా రెడ్డి పరిశీలించారు. దీపావళి పండుగకు నాలుగైదు రోజుల ముందుగా చేపట్టాల్సిన పనులను చివరి క్షణంలో చేపట్టడంతో అసంపూర్తిగా జరుగుతాయని స్థానికులు ఆరోపించారు. శ్మశానవాటికల్లో లైటింగ్ ఏర్పాట్లను పూర్తిచేయాలని, నిర్లక్ష్యం వహించవద్దని కార్పొరేటర్ అధికారులను కోరారు.

పెండింగ్ పనులు వెంటనే ప్రారంభించండి

బంజారాహిల్స్, అక్టోబర్ 30: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని పలు బస్తీల్లో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన.. జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతిని కలిసి వినతిపత్రం అందజేశారు. పద్మాలయ అంబేద్కర్‌నగర్ బస్తీ, ఫిలింనగర్ రోడ్ నం. 9లోని అంబేద్కర్‌నగర్, సాయిబాబా ఆలయం, ఫిలింనగర్ పీఎస్ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, కొత్త రోడ్లను వెంటనే ప్రారంభించాలని కోరారు. నిధులు మంజూరయినా పనులు ప్రారంభించడంలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. స్పందించిన జోనల్ కమిషనర్ త్వరగా పనులు ప్రారంభమయ్యేలా చూస్తామన్నారు.

మెరుగైన సమాజ నిర్మాణంలో జనసేవాదళ్ పాత్ర కీలకం

హిమాయత్‌నగర్, అక్టోబర్ 30: మెరుగైన సమాజ నిర్మాణంలో జనసేవాదళ్ పాత్ర ఎంతో కీలకమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు భాగం హేమంత్‌రావు, జనసేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు పంజాల రమేశ్ అన్నారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో జనసేవాదళ్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో రోజు రోజుకు మతోన్మాద శక్తుల ఆరాచకాలు పెరిగిపోతున్నాయని, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసం జనసేవాదళ్ కార్యకర్తలు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలను శాస్త్రీయ దృక్పథం వైపు నడిపించాల్సిన ప్రభుత్వాలు మూఢత్వంలోకి నెట్టివేస్తున్నాయని విమర్శించారు. నవంబర్ 25 నుంచి 30 వరకు మేడ్చల్ జిల్లా కీసరలో జనసేవాదళ్ రాష్ట్ర స్థాయి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జనసేవాదళ్ రాష్ట్ర నేతలు మోహన్, మారుపాక అనిల్‌కుమార్, మేకల శ్రీనివాస్, శంకర్, పుట్ట లక్ష్మణ్, వినోద్ పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎస్‌వీ పాఠశాలలో దీపావళి వేడుకలు

యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్‌లోని శ్రీసాయి సరస్వతి విద్యానికేతన్ పాఠశాలలో బుధవారం 'దీపావళి' వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు అలంకరణలతో పౌరాణిక నాటికలు, నాట్య ప్రదర్శనలు, ఉపన్యాసాలతో అలరించారు. వేడుకల్లో ముఖ్య అతిథిగా పాఠశాల చైర్‌పర్సన్ శిరీష శంకర్ పాల్గొని దీపావళి విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఉషా మీనాక్షి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. *– జూబ్లీహిల్స్, అక్టోబర్ 30*

నిమ్స్‌లో ఉద్యోగుల పదవీ విరమణ

ఖైరతాబాద్, అక్టోబర్ 30 : నిమ్స్ ఆస్పత్రిలో సేవలందించిన పలువురు ఉద్యోగులు బుధవారం పదవీ విరమణ పొందారు. లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని ముఖ్య అతిథిగా హాజరైన నిమ్స్ డీన్ లీజారాజేఖర్ సత్కరించారు. పదవీ విరమణ పొందిన వారిలో డైటీషియన్ ఎన్. హితశ్రీ, మెడికల్ రికార్డు అసిస్టెంట్ ఆంజనేయులు, నర్సింగ్ ఆఫీసర్లు గౌరీ కుమారి, నిర్మల ఉన్నారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతి వీర్, అనుసంధానాధికారి ఎ. రాంబాబు, రాజ్‌కుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

బండ్లగూడ,అక్టోబర్ 30: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అత్తాపూర్ పోలీసుల వివరాల ప్రకారం...మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట్ మండలం, మీది తండాకు చెందిన మంగ్యానాయక్(38) అత్తాపూర్ పాండురంగ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. అప్పుల బాధతో బుధవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

ఖైరతాబాద్, అక్టోబర్ 30 : గుడికి వెళ్లి వస్తానంటూ బయటకు వెళ్లిన ఓ బాలిక కనిపించకుండా పోయింది. ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. ఏఎస్ఐ శ్రీరాములు వివరాల ప్రకారం... ప్రేమ్‌నగర్‌కు చెందిన ఆపూరి ఆండాలు కుమార్తె యశస్విని (16) ఈ నెల 29న గుడికి వెళ్తున్నాంటూ తల్లికి చెప్పి బయటకు వెళ్లింది. రాత్రయినా ఇంటికి తిరిగి రాలేదు. ఓ యువకుడిపై అనుమానం ఉందని బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేపట్టారు.

అభివృద్ధి పనులు వేగవంతం

వెంగళరావునగర్, అక్టోబర్ 30 : డివిజన్‌లో అభివృద్ధి పనులను వేగంవంతం చేస్తున్నామని కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిగూడ వడ్డెరబస్తీలో సూతన రోడ్డు మరమ్మతు పనులను ఆమె పరిశీలించారు.

వివాదాస్పద స్థలంలో ఆక్రమణలు

-రూ.40కోట్ల విలువైన స్థలం స్వాధీనం

-ప్రభుత్వ హెచ్చరిక బోర్డు ఏర్పాటు

బంజారాహిల్స్, అక్టోబర్ 30: షేక్‌పేట మండల పరిధిలోని బంజారాహిల్స్ రోడ్ నం. 2లో వివాదాస్పద ప్రభుత్వ స్థలంలో వెలిసిన ఆక్రమణలను రెవెన్యూ సిబ్బంది తొలగించి సుమారు రూ.40కోట్ల విలువైన స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. షేక్‌పేట మండలం సర్వే నంబర్ 403లోని టీఎస్ 1లో బంజారాహిల్స్ రోడ్ నం 2లోని పార్క్ హయత్ హోటల్ పక్కనున్న సుమారు 5.16 ఎకరాల స్థలం విషయంలో ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు జి.వివేక్, జి.వినోద్ కుటుంబ సభ్యులకు మధ్యన న్యాయస్థానాల్లో వివాదాలు నడుస్తున్నాయి. రెవెన్యూ రికార్డుల ప్రకారం టీఎస్-1లోని 5.16 ఎకరాల స్థలం మొత్తం ప్రభుత్వానిదే అని రెవెన్యూశాఖ వాదిస్తుండగా, ఈ స్థలాన్ని తాము ప్రైవేటు వ్యక్తుల వద్ద కొనుగోలు చేశామని ఎమ్మెల్యే వినోద్ కుటుంబం వాదిస్తుంది. ఈ వ్యవహారంపై టైటిల్ కోసం సిటీ సివిల్‌కోర్టులో కేసు నడుస్తున్నది. ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దంటూ యథాతథ స్థితిని కొనసాగించాలని కోర్టులో ఆదేశాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా.. కింది భాగంలో సాగర్ సొసైటీని ఆనుకుని ఉన్న ఉమెన్ కో ఆపరేటివ్ సొసైటీకి, కోర్టులో ఉన్న 5.16 ఎకరాల వివాదాస్పద స్థలానికి మధ్యన ఉన్న సుమారు 2వేల గజాల స్థలంలో మంగళవారం రాత్రి బ్లూ షీట్లను ఏర్పాటు చేశారు. ఈ స్థలం ఉమెన్ కో ఆపరేటివ్ సొసైటీ లే అవుట్‌లోనిదని, కోర్టు తీర్పు వచ్చిన తర్వాత తాము ఈ స్థలాన్ని కొనుగోలు చేశామం టూ కొంతమంది స్థలం చుట్టూ బ్లూ షీట్లు ఏర్పాటు చేయడం వివాదాస్పదంగా మారింది. బుధవారం ఈ విషయాన్ని గురించి సమాచారం అందుకున్న సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, షేక్‌పేట మండల తాసీల్దార్ అనితారెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది బ్లూ షీట్లను కూల్చేసి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ స్థలం ప్రభుత్వానిది అంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ స్థలం విలువ సుమారు రూ.40కోట్లు ఉంటుందని రెవెన్యూశాఖ అధికారులు తెలిపారు.

బంజారాహిల్స్ రోడ్ నం. 2లోని సాగర్ సొసైటీ పక్కన వివాదాస్పద స్థలంలో అక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

'చైతన్య భారతి'లో దీపావళి వేడుకలు

మణికొండ, అక్టోబర్ 30 : గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో దీపావళి పండగను పురస్కరించుకుని చైతన్య పరివృత, సృజనక్లబ్‌ల సంయుక్తంగా కలిసి నూనె దీపాల తయారీ, వాటి ప్రాముఖ్యతపై మూడురోజుల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.సీవీ నరసింహులు మాట్లాడుతూ.. దీపావళి పండుగ సమయంలో సంప్రదాయ నూనె దీపాలను వెలిగించడంలోని ప్రాముఖ్యతను, చీకటిపై కాంతి, అజ్ఞానంపై జ్ఞానం, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా మనం దీపాలను వెలుగిస్తామన్నారు. చైతన్య పరివృత కన్వీనర్ మహేశ్వర్‌రెడ్డి , చైతన్య సృజన క్లబ్ కన్వీనర్ సత్యవతి, విద్యార్థి కో-ఆర్డినేటర్ పెద్ది ప్రశాంతి, పీఆర్ఓ జీఎన్ ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సర్దార్‌పటేల్ సేవలు ఆదర్శనీయం

మణికొండ, అక్టోబర్ 30 : దేశ సమగ్రత కోసం సర్దార్ పటేల్ చేసిన సేవలు ఆదర్శనీయమని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జి.చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం పటేల్ జయంతి ఉత్సవాలను కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ అధికారి బాల్‌రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు రవిచందర్, డా.వి.హరిలీల పాల్గొన్నారు.

సమగ్ర కులగణనలో భాగస్వాములు కావాలి

ఖైరతాబాద్, అక్టోబర్ 30 : రాష్ట్రంలో త్వరలోనే చేపట్టే సమగ్ర కులగణనకు పార్టీలకు అతీతంగా అందరూ భాగస్వాములై మద్దతు నివ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీల సుదీర్ఘ పోరాటాల ఫలితంగా ప్రభుత్వం నేడు సమగ్ర కులగణనకు ముందుకు వచ్చిందన్నారు. ఎలాంటి ఆటంకాలకు తావు లేకుంగా ఈ ప్రక్రియ కొనసాగాలన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు వేణుగోపాల్ గౌడ్, డి. మల్లయ్య యాదవ్, నాగేశ్, తాళ్ల సంపత్, యాదగిరి, భాస్కర్ , తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మలుగా గుర్తించాలి..

రాష్ట్రంలో త్వరలోనే చేపట్టే సమగ్ర కులగణనలో విశ్వబ్రాహ్మణులను విశ్వకర్మలుగా గుర్తించి నమోదు చేయాలని తెలంగాణ రాష్ట్ర విశ్వకర్మ మను మయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుంకోజు కృష్ణమాచారి కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడు తూ.. దేశ వ్యాప్తంగా రెండు తెలుగు రాష్ట్రాలు మినహా అన్ని రాష్ట్రాల్లో విశ్వకర్మలుగా గుర్తించారని, ఇక్కడ కూడా ఆ దిశగా పాలక ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు